# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక



**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 3 | సంచిక: 274 | పేజీలు: 6 | వెల: రూ.3/- | మంగళవారం జనవరి 13 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి




## పాలనా వ్యవస్థ మరింత సమర్థవంతం

**అశాస్త్రీయంగా జిల్లాల విభజన**

**వాటిని సరిదిద్ది పాలనాపర ఇబ్బందులు తొలగిస్తాం**

**రిటైడర్డ్ జడ్జినేతృత్వంలో కమిటీ ఏర్పాటు**

**టీజీఓ డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో సీఎం రేవంత్**

హైదరాబాద్, జనవరి 12 (ప్రభాత ఉదయం)

తెలంగాణలో గత ప్రభుత్వం అశాస్త్రీయంగా ఏర్పాటు చేసిన కొత్త జిల్లాలు, మండలాలను రేషనలైజ్ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ టీజీఓ డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర పాలనలో సమస్యలు సృష్టించిన ఈ జిల్లాల ఏర్పాటును సమీక్షించి సరిదిద్దుతామని ఆయన స్పష్టం చేశారు. ఇది రాష్ట్రంలోని పాలనా వ్యవస్థను మరింత సమర్థవంతం చేయడానికి అవసరమన్నారు.గత ప్రభుత్వం అశాస్త్రీయంగా కొత్త జిల్లాలు ఏర్పాటు చేయడం వల్ల పాలనపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లిందని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. జిల్లాల సరిహద్దులు మార్చాలని విజ్ఞప్తులు వస్తున్నాయని, త్వరలో జిల్లాల పునర్విభజన కోసం విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆ కమిటీ రాష్ట్రమంతా తిరిగి అభిప్రాయాలు స్వీకరిస్తుందని చెప్పారు. రాచకొండ కమిషనరేట్ పేరు సహేతుకంగా లేదనే మార్చినట్లు చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త జిల్లా కేంద్రాల్లో ఇళ్ల స్థలాలు

..మిగతా 2లో

# మధ్యవర్తిత్వం ద్వారా జల వివాదాలు పరిష్కరించుకోవాలి

**పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపై సుప్రీం విచారణ**

**విచారణకు హాజరైన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.. తెలంగాణకు సుప్రీం ధర్మాసనం సూచన**

**కేటాయింపులకు మించి వాడరాదన్నదే మా అభ్యంతరం: ఉత్తమ్**

న్యూఢిల్లీ, జనవరి 12 (ప్రభాత ఉదయం)

పోలవరం - నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో సోమవారం విచారణకు వచ్చింది.. ఈ విచారణకు తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా సుప్రీంలో తెలంగాణ సర్కార్ రిట్ పిటీషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆర్టికల్ 131 కింద సివిల్ సూట్ దాఖలు చేసుకోవాలని సీజేఐ ధర్మాసనం సూచించింది. మధ్యవర్తిత్వం ద్వారా జల వివాదాలను పరిష్కరించుకోవాలని కూడా మార్గనిర్దేశంచేసింది. కేంద్ర ప్రభుత్వం నియమించిన ఉన్నతస్థాయి కమిటీ వద్ద తెలంగాణ వాదనలు వినిపించుకోవచ్చనీ అభిప్రాయపడింది.అయితే.. తెలంగాణ ప్రభుత్వంతో మాట్లాడి మళ్లీ తమ వాదనలు వినిపిస్తానని గత విచారణ సందర్భంగా సీనియర్ కౌన్సిల్ అభిషేక్ మను సింఘ్వీ తెలిపారు. నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు లేనందున ప్రాజెక్టు పనులు ఆపాలని తెలంగాణ సర్కార్‌కు తెలిపింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. రాష్ట్రం తరఫున సీనియర్ న్యాయవాది అబిషేక్ మను సింఘ్వీ మరోసారి వాదనలు వినిపిస్తున్నారు.పోలవరం ప్రాజెక్టు నుంచి బనకచర్ల హెడ్ రెగ్యులేటర్

..మిగతా 2లో




# పిజెఆర్‌కు సిఎం రేవంత్ ఘన నివాళి

**ఖైరతాబాద్ విగ్రహం వద్ద పుష్పాంజలి**

హైదరాబాద్, జనవరి 12 (ప్రభాత ఉదయం)

దివంగత కాంగ్రెస్ నేత, మాజీమంత్రి పి. జనార్ధన్ రెడ్డి జయంతి సందర్భంగా ఖైరతాబాద్ సర్కిల్ లోని ఆ మహనీయుడి విగ్రహానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పిజెఆర్ పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచన నేతగా కొనియాడారు. ఆయన ప్రజల కోసం నిరంతరంగా పాటుపడ్డారని అన్నారు. పేదల సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో పిజెపి తనయ విజయా రెడ్డి,మంత్రి దామోర రాజనర్సింహ, ఎమ్మెల్యే నవీన్ యాదవ్ కూడా పాల్గొని పిజెఆర్‌కు నివాళి అర్పించారు.



## బెంగాల్ సర్ ప్రక్రియపై మమత అభ్యంతరం

**ఓటర్ల జాబితా డిజిటలైజేషన్ ప్రక్రియలో లోపాలు**




కోల్‌కతా, జనవరి 12 (ప్రభాత ఉదయం)

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించి పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ మరోసారి అభ్యంతరాలు లేవనెత్తారు. ఈ పక్రియ కోసం వినియోగిస్తున్న 2002 నాటి ఓటర్ల జాబితా డిజిటలైజేషన్ పక్రియలో లోపాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. దీంతో నిజమైన ఓటర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈమేరకు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు లేఖ రాశారు. ఎస్ఐఆర్ మొదలు సీఈసీకి దీదీ లేఖ రాయడం ఇది ఐదోసారి. కృత్రిమ మేధ ఆధారంగా 2002 నాటి

..మిగతా 2లో



## మకర సంక్రాంతిపైనా వివాదం

**సంక్రమణం 14ననే అంటున్న కొందరు**

తిరుమల, జనవరి 12 (ప్రభాత ఉదయం)

పండగల తేదీలపై ఏటా కొన్ని విభేదాలు వస్తూనే ఉన్నాయి. ఏ రోజు ఏ పండగ అన్నది వివాదాలకు దారితీస్తోంది. తాజాగా సంక్రాంతి పర్వదినంపైనా కొంత చర్చ మొదలయ్యింది. మకర సంక్రాంతి.. ఏడాదిలో వచ్చే తొలి పండగే కాదు. అతి పెద్ద పండగల్లో ఇది కూడా ఒకటి. ఈ ఏడాది ఈ మకర సంక్రాంతి పండగ జనవరి 14 లేదా 15వ తేదీన జరుపుకోవాలా? అనే సందేహం చాలా మందిలో కలుగుతోంది. అదీకాక చాంద్రమానం ప్రకారం ఏడాదిలో దాదాపు అన్ని పండగలు జరుపుకుంటాం. కానీ సౌరమానం ఆధారంగా సంక్రాంతిని జరుపుకుంటాం. ఇంకా చెప్పాలంటే.. సూర్యుడు ధనస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశించే పవిత్ర ఘడియలనే మకర సంక్రాంతిగా

..మిగతా 2లో

## గెలిచిన సర్పంచ్‌లతో కెటిఆర్ ఆత్మీయ సమ్మేళనం

**అబద్ధపు హామీల అధికారానికి రెండేళ్లు**

**ఎరువుల ఇవ్వలేని వాడు...ఏం ఉద్దరిస్తాడు**

**ఆనాటి వైభవం అంతా కాలగర్భంలో కలిసిందని విమర్శలు**



మహబూబ్‌నగర్, జనవరి 12 (ప్రభాత ఉదయం)

అబద్ధపు హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా రాష్ట్రంలో ఎక్కడేసిన గొంగడి అక్కడే ఉన్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఎరువలే సక్కగ ఇవ్వలేనోడు..ఇక రైతులను ఏం ఉద్దరిస్తాడని సిఎం రేవంత్‌పై విరుచుకుపడ్డారు.మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచిన సర్పంచ్‌లు, వార్డు సభ్యులతో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గెలిచిన సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు అభినందనలు తెలియజేశారు. పోరాడి ఓడిన వారిని కూడా అభినందించారు. ఆ తర్వాత ఆయన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా రాష్టాన్ని ఏమాత్రం అభివృద్ధి చేయకపోవడంపై మాట్లాడారు. 'గతంలో నేను మున్సిపల్ మంత్రిగా పనిచేసిన. 2014

..మిగతా 2లో



## కూకట్‌పల్లిలో రిజిస్ట్రార్ కార్యాలయానికి పొంగులేటి శంకుస్థాపన

హైదరాబాద్, జనవరి 12 (ప్రభాత ఉదయం)

తమ ప్రభుత్వం పేదల భూములకు రక్షణ కల్పించే చర్యలు తీసుకుంటుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యానించారు. అవుటర్ రింగ్ రోడ్డు లోపల 39 సబ్ రిజిస్టార్ కార్యాలయాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. వాటిని 12 క్లస్టర్‌లుగా విభజించి ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్టర్ కార్యాలయాలు నిర్మిస్తున్నామని చెప్పుకొచ్చారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు వీటి నిర్మించేందుకు

..మిగతా 2లో

# మధ్యవర్తిత్వం ద్వారా జల వివాదాలు పరిష్కరించుకోవాలి

మొదటి పేజీ తరువాయి...

లేదా నల్లమల సాగర్ జలాశయానికి లింక్ చేసేలా గోదావరిపై ఏపీ ప్రాజెక్టు నిర్మిస్తోందంటూ రిట్ పిటిషన్‌లో తెలంగాణ పేర్కొంది. ఈ ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు లేవని, ఆ పనులను తక్షణమే నిలిపివేసేలా పోలవరం ప్రాజెక్టు అథారిటీని ఆదేశించాలని అభ్యర్థించింది. కేంద్ర ప్రభుత్వం అనుమతించిన మేరకే పోలవరం ప్రాజెక్టు స్వరూపం ఉండాలని, విస్తరణ పనులు చేపట్టడం చట్టవిరుద్ధమని పిటీషన్‌లో పేర్కొంది. తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా నల్లమల సాగర్ ప్రాజెక్టు ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టును కేంద్ర ప్రభుత్వం పరిశీలించడం సమంజసం కాదని చెప్పింది. ఈ ప్రాజెక్టుపై తదుపరి చర్యలు చేపట్టరాదంటూ జలశక్తి మంత్రిత్వ శాఖ, కేంద్ర జలసంఘం, గోదావరి నదీ యాజమాన్య బోర్డులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని రిట్ పిటిషన్‌లో పేర్కొంది తెలంగాణ. అయితే.. వరద జలాలను మాత్రమే తాము వాడుకుం టున్నామని ఆంధ్రప్రదేశ్ బదులిచ్చింది. బచావత్ ట్రిబ్యునల్ తీర్పునకు విరుద్ధంగా పోలవరం నుంచి గోదావరి జలాలు తరలించేందుకు ఉద్దేశించిన ప్రాజెక్టును నిలిపివేయాలని తెలంగాణా సర్కార్ పిటిషన్‌లో ప్రస్తావించింది. గోదావరిపై నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు నుంచి 200 టీఎంసీల నీటిని బొల్లాపల్లి రిజర్వాయర్ ద్వారా నల్లమల్ల సాగర్‌కు తరలించేందుకు ఏపీ ప్రభుత్వం ఈ కొత్త ప్రాజెక్టును ప్రతిపాదిం చిందని చెబుతోంది. ఈ ప్రాజెక్టును నిలిపివేయాలని ఇదివరకే కేంద్ర జలశక్తి శాఖకు, జల వనరుల సంఘానికి లేఖ రాసింది. పోలవరం నల్లమల్ల సాగర్ కోసం ఏపీ ప్రభుత్వం టెండర్ నోటిఫికేషన్ జారీ చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది తెలంగాణ. తమ ప్రయోజనాలకు నష్టం కలిగించే నిబంధనలు, విభజన చట్టానికి వ్యతిరేకంగా బనకచర్ల లింకు ప్రాజెక్టు చేపట్టకుండా చూడాలని కోరింది.కేటాయింపుల కంటే ఎక్కువ నీళ్లు వాడొద్దనేది ముఖ్యమైన అంశం అని మంత్రి ఉత్తమ్ అన్నారు. ఏపీ ప్రభుత్వం అనేకసార్లు ఉల్లంఘనలకు పాల్పడింది. వాటిని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చాం. స్టాప్ వర్క్ ఆర్డర్‌ను అమలు చేయడం లేదని తెలిపాం. ఏపీకి



కేటాయించింది 484.5 టీఎంసీలు.. కానీ ఎక్కువగా ఉపయోగించుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. గోదావరి, కృష్ణా బోర్డులు, అపెక్స్ కౌన్సిల్ అనుమతులు లేకుండా ఏపీ ప్రభుత్వం ముందుకెళ్తోందని కోర్టు దృష్టికి తీసుకెళ్లాం. ముందు డిజైన్ చేసినదానికంటే అదనంగా ఏమీ చేయడానికి వీల్లేదని వాదించాం. పోలవరం ప్రాజెక్టు ఒరిజినల్ ఫామ్‌కు అదనంగా మార్పులు చేయడానికి వీల్లేదని వాదనలు వినిపించాం అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు.



# యూరియా వాడకం తగ్గించండి

## ఆదాతో పాటు ఆదాయం పెరుగుతుంది

## రైతులకు మంత్రి తుమ్మల సూచన

## డ్రోన్ స్ప్రేను ప్రారంభించిన మంత్రి

ఖమ్మం, జనవరి 12 (ప్రభాత ఉదయం)

పంటలకు యూరియా వాడటం వల్లే నష్టం కలుగుతోందని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. యూరియా వాడకం క్రమంగా తగ్గించాలని సూచించారు. అన్నదాతలకు పెట్టుబడి ఖర్చు తగ్గాలని, ఆదాయం పెరగాలని పేర్కొన్నారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గిస్తే ఆదాతో పాటు ఆదాయం పెరుగుతుందన్నారు. సోమవారం రఘునాథపాలెం మండలం చింతగుత్తిలో డ్రోన్ స్ప్రేను మంత్రి తుమ్మల ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. తాను పురుగులమందులకు వ్యతిరేకమని చెప్పుకొచ్చారు మంత్రి తుమ్మల. పంటకు కొట్టాల్సిన దానికంటే ఎక్కువ పురుగులమందు కొట్టి భూమాతను చంపేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాచురల్ ఫార్మింగే ఉత్తమమని.. దీనిపై రైతన్నలు దృష్టిసారించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి పురుగులమందుల డూప్లికేట్ కంపెనీలు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. పంటలకు ఎక్కడ, ఏ తెగులు ఉందని శాటిలైట్ ద్వారా సమీక్షించి రైతుకు చెప్పాలని అనుకుంటున్నామని తెలిపారు. దానికి కొన్ని గ్రామాలను పైలెట్ ప్రాజెక్ట్‌గా తీసుకుంటున్నామని వెల్లడించారు. అన్నదాతలందరికీ అధికారులు డ్రోన్ల మీద అవగాహన కల్పించాలని సూచించారు. తాను పంటలకు యూరియా వేయనని, యూరియా వేయకపోతే పురుగుమందు వాడాల్సిన అవసరం లేదని చెప్పుకొచ్చారు. యూరియా ఎంత కావాలంటే అంత ఇస్తామని, కానీ అది పంట చేలకు అరిష్టమని తెలిపారు. ప్రతిపక్షాలు యూరియా మీద పబ్బం గడపాలని చూస్తున్నాయని విమర్శలు గుప్పించారు. పామాయిల్, కొబ్బరికి డ్రోన్ అవసరం ఉండదని చెప్పుకొచ్చారు. చిన్న, సన్నకారు రైతులకు ఉపయోగపడే విధంగా మిషన్లు కనిపెట్టాలని శాస్త్రవేత్తలను కోరారు. అన్ని దేశాల్లో మన దేశం నంబర్ వన్ అని, అన్ని రాష్ట్రాల్లో తెలంగాణ రాష్ట్ర నంబర్ వన్‌గా ఉండాలనేదే తన ఆకాంక్షని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# పాలనా వ్యవస్థ మరింత సమర్థవంతం

మొదటి పేజీ తరువాయి...

ఇస్తామని సీఎం వెల్లడించారు. వరంగల్, హనుమకొండ జిల్లాలను కలపాలని ప్రజల నుంచి డిమాండ్ వస్తోందని.. ఇలాంటి సమస్యలను పరిష్కరించడానికి త్వరలో రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో ఓ కమిషన్ ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. ఈ కమిషన్ ఆరు నెలలపాటు క్షేత్రస్థాయిలో పర్యటించి జిల్లాలు, మండలాల రేషనలైజేషన్ పై నివేదిక సమర్పిస్తుందని సీఎం చెప్పారు. అన్ని జిల్లాల్లో మండలాలు సమానంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అలాగే, బ్జడెట్ సమావేశాల్లో ఈ అంశంపై చర్చించి, అన్ని పార్టీల అభిప్రాయాలు తీసుకుంటామని, విధివిధానాలు రూపొందిస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు. కమిషన్ నివేదిక ఆధారంగానే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులను ప్రభుత్వ సారథులుగా సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. 'మా ప్రభుత్వ వారదులు.. సారథులు ప్రభుత్వ ఉద్యోగులే. ఆనాడు ప్రభుత్వం తప్పుడు పనులను ఉద్యోగులపై ఒత్తిడి చేసి అమలు చేయించింది. పెద్ద దిక్కుగా ఉండాల్సిన వ్యక్తి ఫామ్ హౌజ్‌లో పడుకున్నారు' అని రేవంత్ రెడ్డి విమర్శించారు. 'నేను అన్నగా వచ్చాను. ఇప్పుడు నేను 18 గంటలు పనిచేస్తున్నాను. ఈరోజు డీఏ ఫైల్ మీద సంతకం చేసి వచ్చాను. దీంతో ప్రభుత్వానికి రూ.227కోట్ల భారం పడుతుంది' అని రేవంత్ రెడ్డి ఉద్యోగులనుద్దేశించి మాట్లాడారు.ఉద్యోగుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ప్రతీ ఉద్యోగికి రూ.1.02 కోట్ల ప్రమాద బీమా పథకాన్ని త్వరలో అమలు చేస్తాం. ఉద్యోగులు, ప్రభుత్వం వేరువేరు కాదు. ఇద్దరం కలిస్తేనే ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయి' అని సీఎం అన్నారు. అలాగే, భూములు, ఇసుక, ఉప్పు సబ్సిడీలో అవకతవకలు జరుగుతున్నాయని, వాటిని నిరోధిస్తే ప్రభుత్వ ఆదాయం మెరుగవుతుందని సీఎం రేవంత్ చెప్పుకొచ్చారు. తాను ఇప్పటివరకు ఒక్క రోజు కూడా సెలవు తీసుకోలేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తీసుకుందామని అనుకున్నా.. ఏదో ఒక పని వచ్చి పడుతోందన్నారు. ప్రభుత్వంలో ఉన్న 200 మంది మాత్రమే రాష్ట్రాన్ని నడపలేరని, 10.50లక్షల ప్రభుత్వ ఉద్యోగులే రాష్ట్రాన్ని నడిపిస్తున్నారని అన్నారు. ఉద్యోగులే ప్రభుత్వ సారథులు, వారధులు. వారి సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యం. ఉద్యోగుల్లో కూడా నేను అంటే నచ్చని వారు చాలా మంది ఉండొచ్చు. నేను వచ్చాక

ఉద్యోగుల జీతాలు ఎలా వస్తున్నాయో మీరే గమనించాలి. ఉద్యోగుల డీఏ దస్త్రాలపై సంతకం చేసి ఇక్కడికి వచ్చాను. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి రూ.కోటి బీమా ఇవ్వాలని నిర్ణయించాం. ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు రూ.12వేల కోట్లు మేర పెండింగ్‌లో ఉన్నాయి. పన్ను వసూళ్లలో అవకతవకలు అరికడితే రావాల్సిన నిధులు వస్తాయి. పన్నులు పెంచాల్సిన అవసరం లేదు. సరిగా వసూళ్లు చేస్తే చాలు'అని అన్నారు.




# కూకట్‌పల్లిలో రిజిస్ట్రార్ కార్యాలయానికి పొంగులేటి శంకుస్థాపన

మొదటి పేజీ తరువాయి...

ముందుకురావడం అభినందనీయమని ఆయన ప్రశంసించారు. కూకట్‌పల్లిలో ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. డబ్బే తమ ప్రభుత్వానికి ప్రాధాన్యం కాదని స్పష్టం చేశారు. భూములు అమ్మి ఖజానా నింపే ఆలోచన ప్రభుత్వానికి లేదని చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందన్నారు. ఎక్కడైనా ప్రభుత్వ అవసరాలకు భూములు తీసుకుంటే డబ్బులతో పాటు వారికి ఇళ్లను నిర్మించి ఇస్తామని మంత్రి పేర్కొన్నారు. హౌసింగ్ కాలనీల్లో.. 40ఏళ్ల క్రితం వేసిన లేఅవుట్లలో ఖాళీ స్థలాలు బై నంబర్స్ వేసి ఆక్రమిస్తున్నారని ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కాపాడలేదని మరికొన్ని చోట్లా వేలం వేస్తున్నారని చెప్పుకొచ్చారు. ఈ ప్రభుత్వం తలుచుకుంటే కాపడకపోవడం అనేది ఉండదని ఆయన అన్నారు. అలాంటి భూములు వేలం వేయకుండా పార్కులు చేసి ప్రభుత్వం రక్షించాలను సూచించారు. పోలీస్ స్టేషన్లు.. భూముల పంచాయతీలు పరిష్కరించే కేంద్రాలుగా మారొద్దని ఆయన కోరారు. 40ఏళ్ల క్రితం పేదలకు ఇచ్చిన స్థలాలను బ్రోకర్లు కబ్జా చేస్తున్నారని ఎంపి ఈటల రాజేందర్ ఆరోపణలు చేశారు పేదలు కొనుక్కున్న భూములకు రక్షణ కల్పించాలని సూచించారు. పేదలు కొన్న భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ ప్రభుత్వం ధనికుల కోసం పనిచేయడం కాదని.. పేదల సమస్యలు పరిష్కరించాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు.

# బెంగాల్ సర్ ప్రక్రియపై మమత అభ్యంతరం

మొదటి పేజీ తరువాయి...

ఓటర్ల జాబితా డిజిటలైజేషన్ చేపట్టారు. అయితే, ఈ పక్రియ సందర్భంగా ఓటర్ల వివరాల్లో తీవ్ర తప్పిదాలు చోటుచేసుకున్నాయి. ఇది కాస్తా పెద్దఎత్తున డేటా మిస్‌మ్యాచ్‌కు దారితీసింది. దీంతో నిజమైన ఓటర్లు ఈ సమస్య బారిన పడ్డారు. ఓటర్ల జాబితా సవరణలకు సంబంధించి గత రెండు దశాబ్దాలుగా అనుసరించిన విధానాలను ఎన్నికల సంఘం పక్కనపెట్టింది. దీంతో ఓటర్లు తమ గుర్తింపును మళ్లీ నిరూపించుకోవాల్సి వస్తోంది. ఈసీ తన సొంత పద్ధతులను విస్మరించడం.. ఏకపక్షం, అహేతుకం, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం.ఎస్ఐఆర్ సమయంలో సమర్పించిన పత్రాలకు సరైన రసీదు ఇవ్వడం లేదు.

# వృధా జలాలలు వాడుకుంటే తప్పేంటి

## అధికారులతో సమీక్షలో సిఎం చంద్రబాబు

అమరావతి, జనవరి 12 (ప్రభాత ఉదయం)

రాజధాని అమరావతిని శ్మశానం, ఎడారి అని గతంలో హేళన చేశారని.. కానీ ఇదో స్ఫూర్తిదాయక ప్రాజెక్టు అని సిఎం చంద్రబాబు చెప్పారు. అభివృద్ధిలో రైతులను భాగస్వాములను చేస్తున్నామన్నారు. అధికారులతో సమీక్షలో సిఎం ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు. పోలవరం అద్భుతమైన ప్రాజెక్టు అని.. అది పూర్తయితే దక్షిణ భారతంలో ఏ రాష్ట్రమూ మనతో పోటీ పడలేదని చెప్పారు. నల్లమలసాగర్ ద్వారా రాయలసీమ ప్రాంతంతో పాటు ప్రకాశం జిల్లాలోని పలు ప్రాంతాలకు నీరు ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఈ ప్రాజెక్టుతో ఎవరికీ నష్టం లేదన్నారు. ఎగువ నుంచి వదిలిన నీళ్లు పోలవరం నుంచి నల్లమల సాగర్‌కు తీసుకెళ్లి వాడుకుంటే తప్పేంటని ప్రశ్నించారు.

# మకర సంక్రాంతిపైనా వివాదం

మొదటి పేజీ తరువాయి...

అంతా పరిగణిస్తారు. ఈ ఏడాది 14వ తేదీన పవిత్ర స్నానాలు, దానధర్మాలు, సూర్య ఆరాధన చేయాలని పండితులు స్పష్టం చేస్తున్నారు.కొన్ని సంప్రదాయ పంచాంగాలు సూర్యోదయం ఆధారంగా నియమాలను అనుసరిస్తాయి. సూర్యుడు సాయంత్రం చాలా ఆలస్యంగా లేదా సూర్యాస్తమయం తర్వాత మకర రాశిలోకి ప్రవేశిస్తాడు. దాంతో పండగ మరుసటి రోజు జరుపుకుంటారు. కానీ ఈ ఏడాది జనవరి 14వ తేదీ మధ్యాహ్నమే ఈ మార్పు జరుగుతుంది. దాంతో ఈ పండగ బుధవారం అంటే.. జనవరి 14వ తేదీనే జరుపుకోవాలని అంటున్నారు.దీని ప్రకారం మకర సంక్రాంతి వేడుకలకు జనవరి 14వ తేదీగా నిర్ణయించారు. ఆరోజు మధ్యాహ్నం 3.13 గంటలకు సంక్రాంతి ముహూర్తం వస్తుంది. ఈ నేపథ్యంలో ఆ రోజే పండగ జరుపుకోవాలని,. అంటే జనవరి 15వ తేదీ కాదన్నది సుస్పష్టం. అయితే ఇప్పటికే మకరసంక్రాంతి 15గా నిర్ణయించారు. ప్రభుత్వం కూడా అదేరోజు సెలవుగా పరిగణించింది. మకర సంక్రాంతి వేళ.. సూర్యుడు దక్షిణాయణం ముగించుకుని.. ఉత్తరాయణం దిశగా ప్రారంభాన్ని సూచిస్తుంది. సూర్య భగవానుడి ప్రయాణ మార్పు ఆశ, కాంతి, సానుకూల శక్తిని తెస్తుందని అంతా ప్రగాఢంగా విశ్వసిస్తారు.ప్రత్యక్ష దైవం సూర్య భగవానుడికి కృతజ్ఞతలు తెలిపేందుకు సూర్యుడిని పూజిస్తారు. పేదవారికి వస్త్రాలు దానం చేస్తారు. తమిళనాడులో పొంగల్‌గా ఈ పండగను జరుపుకుంటారు. ఇది అనేక రోజుల పంట పండగా వారు భావిస్తారు.అసోంలో మాఘ్ బిహుగా జరుపుకుంటారు. పశ్చిమ బెంగాల్లో: పౌష్ పర్బన్ అని ఈ పండగను పిలుస్తారు. అయితే ఈ పండగ పేర్లు, ఆచారాలు భిన్నంగా ఉన్నప్పటికీ అన్ని వేడుకలు పంట శ్రేయస్సుతోపాటు కృతజ్ఞతతో ముడిపడి ఉంటాయి.

# గెలిచిన సర్పంచ్‌లతో కెటిఆర్ ఆత్మీయ సమ్మేళనం

మొదటి పేజీ తరువాయి...

కంటే ముందు మహబూబ్ నగర్ పట్టణం ఎట్లుండే ఇయ్యాల ఎట్లున్నది.. అనేది చూస్తున్న మీ అందరికీ తెలుసు. ఒక్క మహబూబ్‌నగరే కాదు, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్, గద్వాల్ ఇలా ఈ జిల్లాలో ఏ పట్టణం చూసినా ఎట్ల అభివృద్ధి చెందినయో మీరందరూ చూసిండ్రు. ఈ పట్టణాలు 2014కు ముందు ఎట్టుండె, ఇప్పుడు ఎట్టున్నయో మీరు గమనించండి. కేసీఆర్ నాయకత్వంలో ఒక్కటి రెండు కాదు, అన్ని పట్టణాలను అభివృద్ధి చేసుకున్నం. అన్ని పల్లెలను అభివృద్ధి చేసుకున్నం' అని చెప్పారు. 'పట్టణ ప్రగతి, పల్లె ప్రగతి కార్యక్రమాల కింద.. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా బ్రహ్మాండంగా అభివృద్ధి చేసినం. సరే అసెంబ్లీ ఎన్నికల్లో మనం కొద్ది తేడాతో ఓడిపోయినం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లయ్యింది. ఎక్కడేసిన గొంగడి అక్కడే అన్నట్లు ఒక్క పని కూడా కొత్తగా చేసింది లేదు. పల్లెల్లో కేసీఆర్ నాయకత్వంలో ట్రాక్టర్‌లు పెట్టి, నీటి ట్యాంకర్‌లు పెట్టి, చెట్లు పెట్టి, ఇంటింటికి నల్లా పెట్టి, ప్రతి పల్లె వీధుల్లో స్ట్రీట్ లైట్‌లు పెట్టి, డంపింగ్ యార్డులు పెట్టి, వైకుంఠధామాలు కట్టి, పల్లె ప్రకృతి వనాలు కట్టి బ్రహ్మాండమైన అభివృద్ధిని కేసీఆర్ చూపించారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలో ట్యాంకర్లలో నీళ్లు లేవు, ట్రాక్టర్‌లో డీజిల్ లేదు. వీధుల్లో లైట్లు వెలుగుతలేవ్' అని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధిని చూస్తావుంటే తనకు కడుపు నిండిన భావన కలిగిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇవాళ మహబూబ్‌నగర్ జిల్లాలో బీఆర్ఎస్ సర్పంచులతో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో మహబూబ్ నగర్ జిల్లాలో జరిగిన అభివృద్ధిని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు అయినా ఏం చేశారని ప్రశ్నించారు.నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాల ఉమ్మడి నాయకులంతా కలిసి ఇవాళ ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించడాన్ని మెచ్చుకున్నారు. 'దాదాపు నాలుగైదు కిలోమీటర్లు ర్యాలీ తీశారు. నాకు ఆ ర్యాలీని చూస్తావుంటే 2028 ఎలక్షన్ అయిపోయింది.. మనం గెలిచినాము.. కేసీఆర్ గారు మళ్లీ ముఖ్యమంత్రి అయినారు అన్నట్లుగా అనిపించింది' అన్నారు. ఆరేడు వేల మోటార్ సైకిళ్లతోటి బ్రహ్మాండంగా ర్యాలీ తీసింద్రని పార్టీ శ్రేణులను ప్రశంసించారు. 'ర్యాలీగా వస్తుంటే శ్రీనివాస్ గౌడ్ బీఆర్ఎస్ హయాంలో మనం నిర్మించిన ఒక్కో ప్రభుత్వ భవనాన్ని చూపిస్తూ వచ్చాడు. అవన్నీ చూస్తే నాకు కడుపు నిండినట్లు అయ్యింది. మహబూబ్‌నగర్ పట్టణం ఒకప్పుడు ఎట్లుండే, ఇప్పుడు ఎట్లున్నదో మీరందరూ చూస్తా ఉన్నారు. ఒక్క మహబూబ్‌నగరే కాదు నారాయణపేటగానీ, జడ్చర్ల అభివృద్ధిగానీ, రహదారుల విస్తరణగానీ, రహదారుల వెంట వీధి వ్యాపారుల కోసం కట్టిన స్ట్రీట్ వెండింగ్ జోన్‌లుగానీ నాడు మనం చేసిన అభివృద్ధికి నిదర్శనం' అన్నారు.



## పద్మశాలి పురంలో ఘనంగా

# స్వామి వివేకానంద జయంతి వేడుకలు

### రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు టాలెంట్ టెస్ట్..

### ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేసిన ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్,జనవరి12(ప్రభాత ఉదయం)**


అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని పద్మశాలి పురంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పద్మశాలి పురం లోని రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించిన జయంతి వేడుకలకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఇటీవల రామకృష్ణ సేవ సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ టెస్ట్ పరీక్షల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ..స్వామి వివేకానందుడి జీవిత చరిత్ర నేటి యువతకు తెలవాల్సిన అవసరం ఉందన్నారు.విద్యార్థులు ఆయన చరిత్రను తెలుసుకోవాలని సూచించారు.2000 మంది విద్యార్థులు పాల్గొన్న పరీక్షలో మొదటి బహుమతి



కాటేదాన్ స్ప్రింగ్ డేల్స్ పాఠశాల విద్యార్థి బిర్దార్ ప్రతీక్ష రూ.10వేల నగదు బహుమతి,రెండవ బహుమతి రాజేంద్రనగర్ ఆదర్శ పాఠశాల ఆర్యన్ కుమార్ ఝా రూ.5వేలు,మూడవ బహుమతి కాటేదాన్ రవి బ్రిలియంట్ స్కూల్ కృష్ణ సంక్ష రూ.3 వేలను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందుకున్నారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో పోటీతత్వం పెరగడమే కాకుండా గొప్ప వ్యక్తుల గురించి విద్యార్థులు తెలుసుకునే అవకాశం దక్కుతుందని వివరించారు. ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులను ప్రోత్సహిస్తున్న సేవా సమితిని అభినందించారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శంకర రాథోడ్, రామకృష్ణ సేవా సమితి సభ్యులు బొల్ల శ్రీనివాస్, నరేందర్ స్థానిక నాయకులు మసన వెంకటేష్,ధనుంజయ్,మహేష్ గౌడ్,గంజి వెంకటేష్,పి.సూర్య కిరణ్,ప్రొఫెసర్ ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్ నియోజకవర్గంను హైదరాబాద్‌లో కలపడం అంటే....

# ప్రజల భూములు, ఉపాధిని దెబ్బతీసే కుట్ర




మహా ధర్నా లో మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్, రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జీ తోకల శ్రీనివాస్ రెడ్డి లు



ధర్నాలో పాల్గొన్న బీజేపీ నాయకులు

### బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

### రంగారెడ్డి జిల్లా ప్రత్యేకతను చెరిపేయనియ్యం : జిల్లా బీజేపీ అధ్యక్షులు పంతంగి రాజ్ భూ పాల్ గౌడ్

**బుద్వేల్, జనవరి 12 (ప్రభాత ఉదయం)**

రంగారెడ్డి జిల్లాను హైదరాబాద్ జిల్లాలో విలీనం చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదన కు వ్యతిరేకంగా భారత జనతా పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్వర్యంలో సోమవారం రాజేంద్రనగర్ ఆరాంఘర్ చౌరస్తాలో మహా ధర్నా నిర్వహించారు. ఆ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం కన్వీనర్ పొన్నమోని మల్లేశ్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ మహాధర్నా లో నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున బీజేపీ శ్రేణులు తరలివచ్చారు. ధర్నాలో పాల్గొన్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, రంగారెడ్డి జిల్లాను హైదరాబాద్ లో విలీనం చేయడం అనేది కేవలం పరిపాలనపరమైన నిర్ణయం కాదని, దీని వెనుక పెద్ద కుట్ర దాగి ఉందన్నారు. ఈ ప్రాంత ప్రజల భూములు, స్థానిక ఉపాది అవకాశాలు, రాజకీయ ప్రాధాన్యతను దెబ్బతీసేందుకే ప్రభుత్వం ఈ ఎత్తుగడ వేస్తుందన్నారు. జిల్లాకు ఒక ప్రత్యేకత కలిగి ఉందన్నారు. ఈ ప్రాంత ప్రజల భూములు, స్థానిక ఉపాధి అవకాశాలు, రాజకీయ ప్రాధాన్యతను దెబ్బతీసేందుకే ప్రభుత్వం ఈ ఎత్తుగడ వేస్తుందన్నారు. జిల్లాకు ఒక ప్రత్యేక సామాజిక, భౌగోళిక గుర్తింపు ఉందన్నారు. కనీసం గ్రామ సభలు నిర్వహించకుండ ఇలాంటి కీలక నిర్ణయాలు తీసుకోవడం ప్రజాస్వామ్య స్పూర్తికే విరుద్ధం అన్నారు. రంగారెడ్డి జిల్లా ప్రజల హక్కుల కోసం బీజేపీ తుది శ్వాస వరకు పోరాడుతుందన్నారు.జిల్లా ప్రత్యేకతను చెరిపేయనియ్యం : జిల్లా బీజేపీ అధ్యక్షులు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్ : ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తు రంగారెడ్డి జిల్లా ఉనికిని ప్రశ్నార్థకం చేస్తోందని రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్ అన్నారు. అభివృద్ధి పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తు, జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాలను హైదరాబాద్ లో కలసి గందరగోళం సృష్టించాలని చూస్తుందన్నారు. విలీనం జరిగితే స్థానిక సమస్యలు పక్కన పడిపోతాయని, ప్రజల స్వయం నిర్ణయ హక్కు హరించబడుతుందన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ ప్రతిపాదనను ఉప సంహరించుకోవాలన్నారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తమన్నారు.

**మజ్లిస్ పార్టీకి తలొగ్గి.. : తోకల శ్రీనివాస్ రెడ్డి:**

మజ్లిస్ పార్టీకి తలొగ్గి ముఖ్యమంత్రి రాజేంద్రనగర్ నియోజకవర్గం ను హైదరాబాద్ లో కలపాలని చూస్తున్నారని కార్పొరేటర్, రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జీ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రజలు, రాజకీయ నాయకుల అభిప్రాయాలు తీసుకోకుండా ఈ ప్రాంతాన్ని ఎలా హైదరాబాద్ లో విలీనం చేస్తారని ప్రశ్నించారు.

**నినాధాలతో హోరెత్తిన ఆరాంఘర్ పరిసర ప్రాంతాలు**

హైదరాబాద్ వద్దు. రంగారెడ్డి జిల్లా ముద్దు, రంగారెడ్డి జిల్లా ను హైదరాబాద్ లో కలుపవద్దు అంటు నినాధాలతో ఆరాంఘర్ పరిసర ప్రాంతాలు దద్దరిల్లిపోయాయి. ఈ కార్యక్రమంలో అతా పూర్ కార్పొరేటర్ మోంద్ర సంగీత, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జీ అందెల శ్రీరాములు యాదవ్, రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు టి.అం జన్ కుమార్ గౌడ్, నాయకులు వై.శ్రీధర్, ఎం కొమురయ్య, బొక్క బాల్ రెడ్డి, సేవెళ్ల మహేందర్, బుర్ర మహలింగంగౌడ్, నందకిషోర్, మేకల వనితా దామోదర్ రెడ్డి , జి.బాబురావు, సరితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




ధర్నాలో బీజేపీ నాయకులు

## తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ

# టీచర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

**రాజేంద్రనగర్, జనవరి 12 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం సభ్యులు ఏర్పాటు చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో టీచర్ల సంక్షేమానికి, వ్యవసాయ విశ్వవిద్యాలయం అభివృద్ధికి నూతనంగా తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ ఆవిర్భవించింది. ఈ అసోసియేషన్ అధ్యక్షులుగా డాక్టర్ ఎం శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా డాక్టర్ ఓదెల సంపత్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జి సంతోష్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ఆర్ సాయికుమార్, జాయింట్ సెక్రటరీగా డాక్టర్ మధుకర్ రావు, డాక్టర్ పి రేవతి మరియు కోశాధికారిగా డాక్టర్ భరత్ భూషణ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, రిజిస్టార్ డాక్టర్ విద్యాసాగర్ రావు ఇతర యూనివర్సిటీ అధికారులను మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా



ఉప కులపతి ప్రొఫెసర్ జానయ్యను కలిసిన తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

యూనివర్సిటీ అభివృద్ధికై మా వంతు సహకారం ఎల్లవేళలా యూనివర్సిటీ యాజమాన్యానికి ఇస్తామని హామీ ఇవ్వడం జరిగింది. అదేవిధంగా టీచర్లకు సంబంధించి కొన్ని సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది ముఖ్యంగా హెల్త్ ఇన్సూరెన్స్, సరెండర్ లీవ్స్, యు జి సి ఏరియర్స్, టి టి ఏ గురించి వారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. మేము తీసుకువెళ్లిన ఈ సమస్యల పట్ల యూనివర్సిటీ యాజమాన్యం సానుకూలంగా స్పందించింది. ఈ సందర్భంగా యూనివర్సిటీ యాజమాన్యానికి మా అసోసియేషన్ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.



స్వామి వివేకానంద విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎంపి ఇటెల రాజేందర్

## స్వామి వివేకానంద ఆశయాలను యువత స్పూర్తిగా పూర్తిగా తీసుకోవాలి

### ఎంపీ ఈటెల రాజేందర్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( ఘట్కేసర్ సర్కిల్) జనవరి 12 ( ప్రభాత ఉదయం):**

స్వామి వివేకానంద ఆశయాలను యువత పూర్తిగా తీసుకోవాలని మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్ అన్నారు. సోమవారం ఘట్కేసర్ మండలంలోని ఈ డబ్ల్యూ ఎస్ కాలనీ లో స్వామి వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో స్వామి వివేకానంద విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ పాల్గొని వివేకానంద విగ్రహాన్ని ఆవిష్కరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద స్ఫూర్తిని తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని యువతకు సూచించారు. ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అందించడమే కాకుండా భారతదేశం యొక్క సంస్కృతిని ప్రపంచానికి చాటిన మహనీయుడు స్వామి వివేకానందాన్ని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, మాజీ సర్పంచ్ అభసాని యాదగిరి యాదవ్, మాజీ ఎంపీపీ బండారు శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మామిళ్ల ముత్యాలు యాదవ్, బర్ల దేవేందర్, బర్ల రాధాకృష్ణ, ఆంజనేయ పంతులు, చారి, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.



## ఫార్మర్ రిజిస్ట్రీలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

### కేటిదొడ్డి మండల వ్యవసాయ అధికారి రాజవర్ధన్ రెడ్డి

**కేటిదొడ్డి , జనవరి 12 (ప్రభాత ఉదయం)**

రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్ లో రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని కేటిదొడ్డి మండల వ్యవసాయ అధికారి రాజవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కేటిదొడ్డి మండలం కొండాపురం గ్రామంలో ఏఈఓ ప్రియాంకలి అధ్యక్షతన ఫార్మర్ రిజిస్ట్రీ పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ రాజవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. ఫార్మర్ రిజిస్ట్రీ ద్వారా రైతుల వివరాలు ప్రభుత్వానికి స్పష్టంగా అందుబా టులోకి వస్తాయని, దీనివల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను రైతులకు సామర్థ్యవంతంగా అమలు చేయడం సాధ్యమవుతుందని అన్నారు. రైతులు తమ ఆధార్ కార్డు, భూమి పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా వివరాలతో సమీపంలో ఉన్న మీ సేవా కేంద్రం లేదా వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) ను సంప్రదించి రైతు రిజి స్ట్రేషన్ చేసుకోవచ్చునని తెలిపారు. దీని వల్ల పీఎం కిసాన్, రైతు బీమా, పంటల బీమా, ఎరువుల సరఫరా, విత్తనాల పంపిణి, రాయితీ సబ్సిడిలు సులభంగా అందుతాయన్నారు. పంటలకు యూరియా అధికంగా వాడటం వల్లే నష్టం కలుగుతోందని అన్నారు. యూరియా వాడకం క్రమంగా తగ్గించాలని సూచించారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి సహజ వనరుల ఆధారిత వ్యవసాయం చేయడం ద్వారా కలిగే ప్రయోజనాలను రైతులకు ఆయన వివరించారు. ముఖ్యంగా సహజ వ్యవసాయ విధానాలు, జీవామృతం, ఘనజీవామృతం తయారీ విధానాలు, దేశీ ఆవుల ప్రాముఖ్యత, మట్టిలో సూక్ష్మజీవుల పాత్ర, పంట వ్యయాలు తగ్గించి లాభాలు పెంచుకునే మార్గాలు వంటి అంశాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించడం జరిగిందని ఆయన అన్నారు. అలాగే ఆయిల్ పామ్ పంటలో వల్ల రైతులకు కలిగే లాభాలు, సబ్సిడీ వివరాలు, ఎరువుల యాజమాన్యం పైన అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పవన్ కుమార్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శంషాద్, రైతులు పాల్గొన్నారు.



రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ఆవరణలో స్వామి వివేకానంద చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థి సంఘం నాయకులు

## లక్ష్యాన్ని సాదించే వరకు విశ్రమించవద్దు

బుద్వేల్, జనవరి 12 (ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ఆవరణలో సోమవారం పీహెచ్ స్కాలర్, అగ్రి విజన్ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను నిర్వహించారు. స్వామి వివేకానంద చిత్రపటానికి, సరస్వతీ మాత చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజ్ కుమార్ మాట్లాడుతూ, లేచి నిలబడి లక్ష్యాన్ని సాదించేవరకు అగొద్దు అనే స్వామి వివేకానంద సందేశాన్ని నేటికి యువతరానికి మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. స్వామి వివేకానంద యువత హృ దయాలలో చిరకాల జ్వాల గా ×ఉంటారన్నారు. జాతీయ యువత దినోత్సవంలో బాగంగా క్విజ్ పోటీలు, అగ్రిటెక్ రీల్, మారుతున్న వ్యవసాయ రంగంలో యువకుల పాత్ర అనే అంశంపై పోస్టర్ కాంపిటీషన్లు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

# ఫార్మర్ రిజిస్ట్రీ(రైతు నమోదు)ది ప్రతి రైతు చేసుకోవాలి

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జనగామ జిల్లా ప్రతినిధి, జనవరి 12(ప్రభాత ఉదయం):**



రైతు రిజిస్ట్రీ అనేది రైతుల వివరాలను డిజిటల్ రూపంలో నమోదు చేసే ఒక ముఖ్యమైన కార్యక్రమని, ఇది అగ్రి స్టాక్ అనే వ్యవసాయ కంప్యూటరీకరణ ప్రణాళికలో భాగంగా అమలు అవుతోందని, పేరు, చిరునామా, మొబైల్ నంబర్, భూమి వివరాలు ఇందులో నమోదు అవుతాయని. ఈ రిజిస్ట్రీ ద్వారా రైతులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు నేరుగా చేరతాయని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సోమవారం ఒక ప్రకటన లో తెలిపారు. పిఎం - కిసాన్, పంట బీమా, సబ్సిడీలు వంటి పథకాలు సులభంగా అందుబాటులోకి వస్తాయని, ప్రతి రైతుకు ఒక ప్రత్యేక డిజిటల్ ఐడి ఇస్తారన్నారు. ఇది పారదర్శకతను పెంచి, మోసాలను తగ్గిస్తుందని...ఈ రిజిస్ట్రీ ద్వారా రైతుల భూమి వివరాలు సులభంగా గుర్తిస్తరన్నారు. ప్రభుత్వం రైతుల అవసరాలను అర్థం చేసుకుని కొత్త విధానాలు రూపొందించగలదని. పంటలపై సలహాలు, బీమా, రుణాలు వంటి సేవలు డిజిటల్ రూపంలో అందుబాటులో ఉంటాయన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించడానికి ఇది ఒక సమగ్ర వేదికగా పనిచేస్తుందని.. సాంకేతిక పరిజ్ఞానం ఉ పయోగించి వ్యవసాయ రంగం మరింత ఆధునికమవుతుందన్నారు. రైతుల ఆదాయం పెరగడానికి ఇది ఒక కీలక సాధనంగా మారుతుందని.. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ సదుపాయాలు పెరగడం అవసరమన్నారు. రైతు రిజిస్ట్రీ ద్వారా ప్రభుత్వ పథకాల అమలు వేగవంతం అవుతుందని.. జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రీ వ్యవసాయ శాఖ కు సంబంధించిన వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రతి గ్రామానికి వచ్చి ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారన్నారు. పీఎం కిసాన్ తదుపరి వాయిదా డబ్బులు రైతుల ఖాతాలో జమ కావాలంటే ఈ ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరని, రైతులందరూ కూడా తప్పనిసరిగా సంబంధిత ఏఈఓ ల ద్వారా కానీ మీ దగ్గరలో మీసేవ కేంద్రంలో కానీ నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ రైతులను కోరారు.







# కిస్మత్ పూర్‌లో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం

**బండ్లగూడ, జనవరి 12 (ప్రభాత ఉదయం)**

స్వామి వివేకానంద 163 వ జయంతి సందర్భంగా రాజేంద్రనగర్ సర్కిల్ కిస్మత్పూర్ లో సోమవారం తల సేమియా రోగంతో బాధపడుతున్న చిన్నారుల కోసం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రంగారెడ్డి జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యుడు నిరుడు శేఖర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్థానిక ప్రాంతాలకు చెందిన యువకులు పెద్ద సంఖ్యలో హాజరై రక్తదానాన్ని చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాజీ మండలి చైర్మన్ కనకమామిడి స్వామి గౌడ్,హైకోర్టు న్యాయవాది సుంకరి మౌనిక, సరస్వతి విద్యా మందిరాల కార్యదర్శి బొడ్డు శ్రీనివాస్, రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు భీమార్జున్ రెడ్డి బిజెపి సీనియర్ నాయకులు లంకల శ్రీధర్ రెడ్డి,భాస్కర్ రెడ్డి, మహాలింగం గౌడ్, పవన్ సాయి తదితరులు మాట్లాడుతూ... స్వామి వివేకానంద జయంతి సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. తలసేమియా తో బాధపడుతున్న చిన్నారుల కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం హర్షనీయమన్నారు.రక్తదానం వల్ల ముగ్గురి ప్రాణాలను కాపాడిన వారమవుతామన్నారు. ఈ సందర్భంగా రక్తదానం నిర్వహించిన వారికి భగవద్గీత తో పాటు రక్తదాన శిబిర ఏర్పాటు సర్టిఫికెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు స్థానిక ప్రాంతాలకు చెందిన యువకులు బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జవహార్ నగర్‌లో ఘనంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( జవహార్ నగర్ డివిజన్ ) జనవరి 12 ( ప్రభాత ఉదయం)**



జవహర్ నగర్ లో సంక్రాంతి ముగ్గుల పోటీలు అత్యంత వైభవంగా జరిగాయని మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్ అన్నారు. సోమవారం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి జవహర్ నగర్ మథర్ థెరిస్సా కాలనీ లో కాలనీ అధ్యక్షుడు సుకునో భవంతు ట్రస్ట్ క్కమ్ కేకేఎం పౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జవహర్ నగర్ మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్ పాల్గొని ముగ్గుల పోటీలను ప్రారంభించారు. స్థానిక మహిళలు యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని సాంప్రదాయాల విలువలను ప్రతి బింభించేలా వేసిన రంగురంగుల ముగ్గులు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించే తీరుగా జవహర్ నగర్ ఆడబిడ్డలు చక్కటి ముగ్గులతో అందరిని మైమరిపించారని చెప్పారు. ఈ ముగ్గుల పోటీలు నిర్వహించిన ట్రస్టు వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. సుఖినో బావంతు చర్మన్ రత్న ప్రభ, మాధవి, భాగ్యవతి, జయలక్ష్మి, లు హాజరై ముగ్గులలోప్రతిభ కనబరిచిన విజేతలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన జవహర్ నగర్ మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్ చేతులమీదుగా ప్రధమ బహుమతి బి పూజ రెండవ బహుమతి వెన్నెల మూడవ బహుమతి చంద్రకళలకు అంద జేశారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, మాజీ కార్పొరేటర్ కారింగుల నిహారిక గౌడ్, మేడ్చల్ జిల్లా ఐక్య సంఘం అధ్యక్షులు రమేష్ చారీ, రేషన్ డీలర్ల అధ్యక్షుడు అశోక్ గుప్తా, మహేందర్ యాదవ్, దివాకర్, చెన్నా రెడ్డి, భాస్కర్ గౌడ్, కిషోర్, మీనాక్షి, బూడిద వెంకటేష్, శ్రీనివాస్,సరస్వతి, కిరణ్, మామిడి మంజుల, రవి, భాగ్య లక్ష్మి, శారద, చంద్రికల, బి శ్రీను, ఈ రాజు, రాము తదితరులు అధిక సంఖ్యలో కాలనీ మహిళలు పాల్గొన్నారు.

# ప్రజలకు భద్రత కల్పించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలి

## ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**మల్కాజ్ గిరి, జనవరి 12(ప్రభాత ఉదయం)**



ప్రజలకు పటిష్టమైన భద్రత కల్పించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి శాసనసభ్యులు మరి రాజశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారంమల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సఫిల్ గూడ శ్రీ విజయ దుర్గ కట్ట మైసమ్మ దేవాలయం వద్ద ఇటీవల జరిగిన దుర్చర్యపై స్పందించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీస్ అధికారులను ఆయన ఆదేశించారు. ఈ తరహా దుశ్చర్యలు జరగడం అత్యంత దురదృష్టకరమని, ప్రజల శాంతి భద్రతలను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు, ఆలయ కమిటీ సభ్యులు, కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు బద్ధం పరశురాం రెడ్డి, జీకే హనుమంతరావు, రాము యాదవ్, సాయి గౌడ్, బాలకృష్ణ, సర్వేశ్ యాదవ్, వంశీ ముదిరాజ్ తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న గ్రామ సర్పంచ్

## సొంత నిధులతో స్కూల్‌లో మరుగుదొడ్ల నిర్మాణం పనులు ప్రారంభించిన సర్పంచ్

**ధరూర్ , జనవరి 12(ప్రభాత ఉదయం)**

ప్రభుత్వ పాఠశాల అంటే అరకొర వసతులు.. అపరిశుభ్ర వాతావరణం.. కనీస మౌలికసతులు కరువు.. శిథిలావస్థకు చేరిన భవనాలు కనిపిస్తుంటాయి. గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో మౌళిక వసతుల కల్పనకు ఆ గ్రామ సర్పంచ్ ఊరికి ఇచ్చిన మాటను నిలబెట్టుకొన్నారు. ధరూర్ మండలం కోతులగిద్ద గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. వెంటనే స్పందించిన గ్రామ సర్పంచ్ కుర్వగోవిందమ్మ సమస్యల పరిష్కారానికి కార్యచరణ రూపొందించి పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టారు. గ్రామ సర్పంచ్ గోవిందమ్మ స్పందించి మరుగుదొడ్ల నిర్మాణానికి ముందుకు వచ్చారు. సర్పంచ్ సొంత నిధులు వెచ్చించి మరుగుదొడ్డి తో పాటు ఇంకుడు గుంతల నిర్మాణ పనులు ప్రారంభించారు. సర్పంచ్ ఔదార్యానికి గ్రామ ప్రజలు అభినందించారు.



# మున్సిపల్ ఎన్నికల్లో గద్వాల గడ్డపై గులాబీ జెండా ఎగర వెయ్యాలి: కేటీఆర్

## కేటీఆర్‌ని కలిసిన గద్వాల నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు

**గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 12(ప్రభాత ఉదయం)**

మున్సిపల్ ఎన్నికల్లో గద్వాల గడ్డపై గులాబీ జెండా ఎగర వెయ్యాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. సోమవారంమహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని ఏర్పాటుచేసిన నూతన బి ఆర్ ఎస్ సర్పంచులు,ఉపసర్పంచులు, వార్డు మెంబర్ల సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ని డా.ఆంజనేయులు గౌడ్, బిఎస్ కేశవ్ ల తొ కలిసి,బాసు హనుమంతు నాయుడు కలిశారు.ఈ సందర్భంగా త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో గద్వాల గడ్డపై గులాబీ జెండా ఎగర వెయ్యాలని బిఎస్ కేశవ్,బాసు హనుమంతు నాయుడు కి కేటీఆర్ సూచించారు.



# విద్యుత్తు వైర్లు తగిలి ట్రాక్టర్‌పై తరలిస్తున్న గడ్డి దగ్ధం

**గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 12(ప్రభాత ఉదయం)**

గద్వాల మండలం పూడూరు గ్రామ శివారులో సోమవారం ట్రాక్టర్ పై తరలిస్తున్న గడ్డి విద్యుత్ వైర్లు తగిలి దగ్ధమైంది. గద్వాల మండలం పూడూరు గ్రామానికి చెందిన రైతులు పశువుల కోసం గడ్డిని కొనుగోలు చేసి ట్రాక్టర్ పై తరలిస్తుండగా పూడూరు సమీపంలో కిందికి వేలాడుతున్న విద్యుత్ వైర్లు తగిలి మంటలు వ్యాప్తి చెందాయి. దీంతో గడ్డితో పాటు ట్రాక్టర్ ట్రాలీ పూర్తిగా కాలిపోయింది. బాధిత పాడి రైతు గోవింద్ కు ఆర్థిక సాయం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

# భారతదేశ ఔనత్యాన్ని ప్రపంచానికి చాటిన గొప్ప దేశభక్తుడు స్వామి వివేకానంద: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

## స్వచ్ఛత హీసేవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్




**శంషాబాద్,జనవరి12(ప్రభాత ఉదయం)**

భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప దేశభక్తుడు స్వామి వివేకానంద అని రాజేంద్రనగర్ శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్ అన్నారు.మానసిక వికాసం సాధించేందుకు ఆయన చూపిన మార్గం ఎంతో ఉపయుక్తమని ఆయన వ్యాఖ్యానించారు.స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని శంషాబాద్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలనే లక్ష్యంతో స్వచ్ఛత హీ సేవ 2026 కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు.వివేకానందుడు చెప్పినట్లు 'సేవయే పరమావధిగ,మన పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం కూడా దేశానికి మనం చేసే ఒక గొప్ప సేవ అని వివరించారు.ప్రభుత్వం మాత్రమే కాకుండా,ప్రతి పౌరుడు తన వంతుగా పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందామనే అనే నినాదాన్ని పాటించాలన్నారు.మన పిల్లలు ఆడుకునే పార్కులు,మనం నడిచే వీధులు చెత్తాచెదారం లేకుండా చూసుకోవడం మన ప్రాథమిక విధిగా అభివర్ణించారు.యువజన దినోత్సవం కాబట్టి యువత అంతా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ జనవరి 11నుండి ఫిబ్రవరి 15 వరకు జరిగే ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు.చెత్త లేని శంషాబాద్ ప్రతి చెత్త ముక్కా ముఖ్యం అనే విషయాన్ని గుర్తుంచుకుని,మన ప్రాంతాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకుందామని పిలుపునిచ్చారు.ఈ మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన గ్రీన్ ఎర్త్ ఇంటిగ్రేటెడ్ ఫెసిలిటీ ప్రైవేట్ లిమిటెడ్ వారిని అభినందించారు.

# ప్రజల సమస్యలను తీర్చడానికి అధికారులు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి

### జిల్లా కలెక్టర్ రిజ్వన్ బాషా షేక్

### ప్రజావాణి పిర్యాదులు పెండింగ్ క్లియర్ చేయండి

### హాస్టల్‌లను సందర్శించండి

**జనగామ జిల్లా ప్రతినిధి, జనవరి 12(ప్రభాత ఉదయం):**


ప్రజావాణిలో పిర్యాదులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్

ప్రజల సమస్యలను తీర్చడానికి అధికారులు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజావాణి పిర్యాదులు పెండింగ్ క్లియర్ వెంటనే క్లియర్ చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా. జిల్లా లోని వివిధ ప్రాంతాల నుండి తమ సమస్య లను విన్నవించుకునేందుకు వచ్చిన ప్రజలతో కలెక్టర్ మాట్లాడి వారి సమస్య లను తెలుసుకొని, వారు ఇచ్చిన దరఖాస్తు లను తీసుకోని సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేసారు. ప్రజావాణి కార్యక్రమానికి, 43 దరఖాస్తు లు రాగా, వాటిని సంబంధిత శాఖ అధికారులకు తగు చర్యలు తీసుకోవాలని పంపించడం జరిగింది.ప్రజావాణి అనంతరం వివిధ అంశాల పైన అధికారులతో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ రివ్యూ చేస్తు, ముందుగా ప్రజావాణి దరఖాస్తు లను పెండింగ్ లో పెట్టొద్దని, క్షేత్ర స్థాయి లో వాటిని పరిష్కరించి, ప్రజల కి భరోసా కల్పించేందుకు అధికారులు కృషి చేయలన్నారు. రాష్ట్ర స్థాయి లో ఆధార్ అప్ డెషన్ ప్రక్రియ లో ( ఆధార్ లో మార్పులు, చేర్పులు ) జిల్లా టాప్ లో ఉందని,ఇలాగే కొనసాగేలా మానటరింగ్ కమిటీ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. జిల్లా లో సరిపడా యూరియా స్టాక్ అందుబాటులో ఉందని మండల స్పెషల్ అధికారులు, తహసీల్దార్ లు ప్రతీ రోజూ ఫర్టిలైజర్ షాప్ లను పర్యవేక్షణ చేస్తు రైతుల అవసరాలకు సరిపడా యూరియా సరైన విధంగా సరఫరా అయ్యేలా చూడాలన్నారు. జిల్లా లోని అన్ని సంక్షేమ హాస్టల్ లో మెనూ ప్రకారం భోజనం విద్యార్థులకు పెడుతున్నారా లేదా అని ప్రతీ నిత్యం తనిఖీ లు చేస్తు.. పరిశీలించాలన్నారు పీఎం పోషణ యాప్ లో వంద శాతం ఎప్పటికప్పుడు డేటా ఎంట్రీ జరగాలన్నారు. విద్యార్థుల స్కాలర్షిప్ లకు సంబందించి.. కావాలిసిన ధ్రువ పత్రాలను ఎలాంటి ఆలస్యం చేయకుండా తహసీల్దార్ లు జారీ చేయాలన్నారు. జిల్లా లో మినీ మేడారం జరిగే ప్రాంతాల్లో వివిధ శాఖలకు అప్పగించిన బాధ్యత లను త్వరగా చేపట్టాలని... భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్, ఆర్డీవో లు, వివిధ శాఖలకి చెందిన జిల్లా స్థాయి అధికారులు, వారి సిబ్బంది పాల్గొన్నారు.

# భారత దేశ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి స్వామి వివేకానంద

### ఎమ్మెల్యే టి. ప్రకాశ్ గౌడ్

పద్మశాలిపురం లో స్వామి వివేకానంద విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్


బుద్వేల్, జనవరి 12 (ప్రభాత ఉదయం) : భారత దేశ గొప్ప తనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ అన్నారు. మైలార్దేవపల్లి పద్మశాలిపురం శ్రీ రామక్రిష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పద్మశాలిపురం చౌరస్తా లో ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్ స్థానిక నాయకులు, ప్రజలతో కలసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, స్వామి వివేకానంద అడుగు జాడలలో నేటి యువత నడుచుకోవాలన్నారు. ఆయన చూపిన మార్గంలో పది శాతం పంది నడుచుకున్న దేశం భాగుపడుతుందన్నారు. దేశ భక్తి, దైవ భక్తి, సత్ప్రవర్తన తో ప్రతి ఒక్కరు జీవించాలన్నారు. స్వామి వివేకానంద జీవిత చరిత్ర ను నేటి యువత తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.


విద్యార్థులకు నగదు బహుమతులు అందచేస్తున్న ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

**టాలెంట్ టెస్ట్ లో గెలిచిన విద్యార్థులకు నగదు బహుమతులు :**

స్వామి వివేకానంద జయంతి వేడుకలను పురస్కరించుకుని రాజేంద్రనగర్ మండలంలో రెండు వేల మంది విద్యార్థినీ, విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ టెస్ట్ లో విజయం సాదించిన విద్యార్థులకు నగదు బహుమతులను అందజేశారు. మొదటి బహుమతిగా రూ. 10వేలను ప్రథమ స్థానంలో నిలిచిన కాటేదాన్ స్ప్రింగ్ డేల్ హై స్కూల్ విద్యార్థి బిర్దార్ ప్రతీక్ష గెలుచుకున్నారు. ద్వితీయ బహుమతి క్రింద రాజేంద్రనగర్ ఆదర్శ విద్యాలయ హై స్కూల్ విద్యార్థి అర్యన్ కుమార్ ఝా రూ. 5వేలను గెలుచుకున్నారు. తృతీయ బహుమతిని కాటేదాన్ రవి బ్రిలియంట్ హై స్కూల్ విద్యార్థి కృష్ణ సంక్ష రూ. 3వేలను గెలుచుకున్నారు. ఈ కార్యక్రమం లో రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్, రామక్రిష్ణ సేవా సమితి సలహాదారులు బొల్ల శ్రీనివాస్, విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ ఉమాదేవి, బొల్ల రాజేశ్వరి, రామక్రిష్ణ సేవా సమితి అధ్యక్షులు సీహెచ్ శ్రీనివాస్, నాయకులు మసున వెంకటేశ్, టి.ప్రేంగౌడ్, ఎన్ దనుంజయ, పి.సూర్యకిరణ్, గంజి వెంకటేశ్, సీహెచ్ నర్సింహ్మా, బొల్ల నరేందర్, పండాల శివ కుమార్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలలో ఆధునిక వసతులు కల్పించడానికి ముందుకు రావాలి

### కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి

### విద్యతోనే మంచి భవిష్యత్తు : నాడ్ ఆంగ్లయ డైరెక్టర్ వై సి చౌదరి

**వనస్థలిపురం, జనవరి 12 (ప్రభాత ఉదయం)**

సాహెబ్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నార్డ్ ఆంగ్లయ ఎడ్యుకేషన్ , వాసవి క్లబ్ ప్రశాంతినగర్ వారు నిర్మించిన సైన్స్ , ఒకేషనల్ ల్యాబ్స్ ప్రారంభోత్సవం జరిగింది. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా నాడ్ ఆంగ్లయ డైరెక్టర్ వై సి చౌదరి , అభయ ఫౌండర్ బాలచంద్ర స్వామి , కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి , వాసవి వనితా క్లబ్ ప్రతినిధి ఎందురి సుదర్శన్ రావు కృష్ణకుమారి దంపతులు విచ్చేసి నూతన భవనాలను ప్రారంభించారు ఈ భవనాలు 35 లక్షల రూపాయలతో సైన్స్ అండ్ ఒకేషనల్ ల్యాబ్స్ నిర్మించారు. కార్యక్రమంలో బాలచంద్ర స్వామి మాట్లాడుతూ... స్వామి వివేకానంద జయంతి కార్యక్రమము జరుపుకోవడం మనందరం సంతోషించేదగ్గ విషయమని తెలియజేశారు.. చౌదరి మాట్లాడుతూ... నేను కూడా గవర్నమెంట్ పాఠశాలలో చదివి ఈరోజు ఒక సంస్థకు డైరెక్టర్ గా ఉన్నానని మరి కష్టపడి చదివితే విద్యార్థులు కూడా మంచి భవిష్యత్తును నిర్మించుకోగలరని భవిష్యత్తులో కూడా సాహెబ్ నగర్ పాఠశాలకు సహాయం చేస్తామని తెలియజేశారు . ఈ కార్యక్రమంలో నార్డ్ ఆంగ్లయ ఎడ్యుకేషన్ ప్రతినిధులు దీప్త మాతూర్ , గంగాధర్ , రిషిత , పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ వి దినేష్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.






# స్వామి వివేకానంద ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అందించిన మహనీయుడు

### మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( ఉప్పల్ డివిజన్)

**జనవరి 12 (ప్రభాత ఉదయం):-**

స్వామి వివేకానంద ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అందించి భారతదేశపు సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేసిన మహనీయుడు స్వామి వివేకానంద అని అన్నారు. సోమవారం ఉప్పల్ చాకలి బస్తి లో స్వామి వివేకానంద కమిటీ హాల్లో స్వామి వివేకానంద 163 వ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి పాల్గొని స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతకు ప్రేరణ అయిన మహానుభావుడు స్వామి వివేకానంద అన్నారు. రామకృష్ణ పరమహంస శిష్యుడిగా ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పొంది, భారతదేశపు గొప్ప సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేసిన మహనీయుడని అన్నారు. ఆయన మనకు బోధించినది ఒక్కటే శరీర బలం, మానసిక బలం, ఆధ్యాత్మిక బలం కలిసినప్పుడే నిజమైన వ్యక్తిత్వం తయారవుతుందని చెప్పారు. విద్య అనేది కేవలం ఉద్యోగానికి కాదు, జీవితాన్ని నిర్మించడానికి ఉపయోగ పడుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పోజి మధుచారి , సల్ల ప్రభాకర్ రెడ్డి, ముదిగొండ రవి, బూతుక్కారి రాజేష్ గౌడ్, నాగుల సురేష్ నేత, బూతుక్కారి నవీన్, ఎరా రాకేష్, బూతుక్కారి సాయినాథ్ గౌడ్, రాజు, నర్సింగ్, శ్రీనివాస్, రవీందర్, బూతుక్కారి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ బి వీఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

**హైదరాబాద్(బండ్లగూడ), జనవరి 12(ప్రభాత ఉదయం)**



రాజ బహదూర్ వెంకట్రాంరెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీలో ట్రైనీలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించే లక్ష్యంతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, ఐపీఎస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ...అతి తక్కువ సమయంలో ఇన్ని అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయగలగడం వెనుక డిప్యూటీ డైరెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, డీఎస్పీలు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, క్రింది స్థాయి సిబ్బంది ప్రతి ఒక్కరి సమిష్టి కృషి ఉందని తెలిపారు. గత రెండు సంవత్సరాలలో వివిధ విభాగాల సహకారంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేయగలిగామని పేర్కొన్నారు. ఈ రోజు ముఖ్యంగానూతనంగా నిర్మించిన కృష్ణా వాటర్ ట్యాంకులను డైరెక్టర్ ప్రారంభించారు. వీటి ద్వారా ట్రైనీ హాస్టళ్లకు స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయనున్నారు. ట్రైనీలకు ఔట్డోర్ శిక్షణ సమయంలో ఎండ, వర్షాల నుంచి రక్షణ కల్పించే విధంగా 8 స్క్వాడ్ పోస్టులకు టిన్ షెడ్లను ఏర్పాటు చేశారు. ట్రైనీల శారీరక దృఢత్వం పెంపొందించే ఉద్దేశ్యంతో క్రీడా భవనంలో రెండు నూతన జిమ్ లను ఏర్పాటు చేసి డైరెక్టర్ ప్రారంభించారు. ఇంకొక ముఖ్యమైన కార్యక్రమంగా, ఉద్యోగుల పిల్లల సంరక్షణ మరియు రక్షణ కోసం ఏర్పాటు చేసిన "చిన్నారి" చైల్డ్ కేర్ సెంటర్ మొదటి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు డైరెక్టర్ అభిలాష బిస్త్ ఐపీఎస్కు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. డైరెక్టర్ పిల్లలకు స్వీట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. ఎంతో జాగ్రత్తగా నిర్వహిస్తున్న రిజర్వ్ ఇన్స్పెక్టర్ మహేష్, కేర్టేకర్లను ప్రత్యేకంగా అభినందించారు. అకాడమీలో పలు అభివృద్ధి కార్యక్రమాలను డైరెక్టర్ ఆదేశాల మేరకు సమర్థవంతంగా పూర్తి చేసిన విధానాన్ని డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు , అసిస్టెంట్ డైరెక్టర్ వి. శ్రీనివాసరావు వివరించారు. ఈ సందర్భంగా ఔట్ డోర్ స్టాఫ్కు పీటీ డ్రెస్సులు, మెడికల్ యూనిట్ సిబ్బందికి సాప్రాన్లు పంపిణీ చేశారు. అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తిచేయడంలో కీలక పాత్ర పోషించిన అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు మహేష్, శ్రీనివాస్, శంకర్ కృష్ణలను డైరెక్టర్తో పాటు ఇతర ఉన్నతాధికారులు అభినందించారు. ఈ అభినందన సభలో డైరెక్టర్ అభిలాష బిస్త్ ఐపీఎస్, డిప్యూటీ డైరెక్టర్లు జి. కవిత, వెంకటేశ్వర్లు, కె.ఆర్.కె. ప్రసాద్, శ్రీరామ మూర్తి, అసిస్టెంట్ డైరెక్టర్లు నాగేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, భరత్, రమణ, నరహరి, ధనజ, యూనిట్ మెడికల్ ఆఫీసర్ రమాదేవి, అకౌంట్స్ ఆఫీసర్ యాదమ్మ, ఔట్డోర్ మరియు ఇండోర్ అధికారులు, అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ ను కలిసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

# శాంతి భద్రతలకు భంగం కలగకుండా అన్ని చర్యలు చేపట్టాలి

## ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి (ఉప్పల్ సర్కిల్ ) జనవరి 12 (ప్రభాత ఉదయం):-**

ఉప్పల్ నియోజకవర్గంలో శాంతి భద్రత పరిరక్షిస్తూ ప్రజల భద్రతకు అన్ని చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం మల్కాజిగిరి పోలీస్ కమిషనర్గా బాధ్యతలు చేపట్టిన సీపీ అవినాష్ మహంతి ( ఐపీఎస్ ) ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛనందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గంలోని శాంతి భద్రతల పరిస్థితి, ప్రజల భద్రతకు సంబంధించిన అంశాలపై మాట్లాడామని చెప్పారు. పోలీస్ శాఖతో సమన్వయం పెంచుతూ ప్రజలకు మెరుగైన భద్రత కల్పించేందుకు అందరూ కలిసి పనిచేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గోళ్ళూరీ అంజయ్య, మేకల మధు, సుధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


# పేదల పక్షపాతి పీజేఆర్

## మాజీ కౌన్సిలర్ కొడే మహేష్ కురుమ

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( మేడ్చల్ మున్సిపల్ ) జనవరి 12 ( ప్రభాత ఉదయం)**



పీజేఆర్ నిరుపేదల పక్షపాతిగా ప్రజల గుండెల్లో పదిలంగా ఉన్నారని మేడ్చల్ మాజీ కౌన్సిలర్ కొడే మహేష్ కురుమ అన్నారు. సోమవారం దివంగత నేత పి.జనార్ధన్ రెడ్డి (పీజేరి) జయంతి సందర్భంగా మేడ్చల్ జిల్లా కేంద్రంలోని మేడ్చల్ పట్టణంలో మాజీ సి ఎల్పీ నేత పి జనార్ధన్ రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ కౌన్సిలర్ కొడే మహేష్ కురుమ మాట్లాడుతూ పి.జె.ఆర్ నిరుపేదల గొంతుకని గొప్ప కార్మిక నాయకుడని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో సి.ఎల్.పి లీడర్ గా ఖైరతాబాద్ నియోజకవర్గం నుండి ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన మహానాయకుడని అన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమించిన మహోన్నత వ్యక్తి అని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ కౌన్సిలర్ కొడే మహేష్ కురుమఅబశ్రీశ్రీ ఆయనను స్మరించుకున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి, మేడ్చల్ అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉదండపురంఅబశ్రీశ్రీ సత్యనారామణ, మేడ్చల్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు బత్తుల శివ కుమార్ యాదవ్, కొడే మహేష్ కురుమ, రొయ్యపల్లి మల్లేష్ గౌడ్, బత్తుల మధుకర్ యాదవ్, పాలకుర్తి రాఘవేందర్ గౌడ్, నారెడ్డి రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పంజగారి అంజనేయులు, మేకల రాజశేఖర్ రెడ్డి (బబ్లూ),దుబ్బ రామస్వామి ముదిరాజ్, టైలర్ రాజు గౌడ్, వేముల రంజిత్ రెడ్డి, గర్ధాస్ నరేందర్, కాలేరు శ్రీకాంత్ వంజరి, మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు యువకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



వీసీలో రామకృష్ణ రావు

# మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలి

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

**జనగామ జిల్లా ప్రతినిధి, జనవరి 12(ప్రభాత ఉదయం):**

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి మున్సిపల్ శాఖ కార్యదర్శి శ్రీదేవి తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు - కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో ఫోటో ఓటరు జాబితా ప్రకటన, పోలింగ్ కేంద్రాల జాబితా ప్రకటన, మున్సిపల్ ఎన్నికల నిర్వహణ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల నిర్వహణ కొరకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ నెల 12వ తేదీన ఫోటో ఓటరు తుది జాబితా ప్రకటించడం జరుగుతుందని, ఈ నెల 13న పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా ప్రకటన అనంతరం పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై అభ్యంతరాలు, ఫిర్యాదులను స్వీకరించి పరిశీలన, పరిష్కారం పిమ్మట ఈ నెల 16న పోలింగ్ కేంద్రాల తుది జాబితా ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్ ప్రచురణ కొరకు ప్రింటింగ్ ప్రెస్ లను గుర్తించడం వంటి పనులు పూర్తి చేయాలని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాచరణ జారీ లోగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ జిల్లాలోని మున్సిపాలిటీలలో ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎన్నికల నిర్వహణకు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. వార్డు ల వారీగా తుది ఓటరు జాబితా ఈరోజు విడుదల చేయడం జరిగిందని.. ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితా రేపు, ఈ నెల 16 న తుది పోలింగ్ కేంద్రాల జాబితాను, పోలింగ్ స్టేషన్ ల వారీగా తుది ఓటరు జాబితా ను ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ప్రకటించి, ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల నిర్వహణ కొరకు నోడల్ అధికారులు, జోనల్ అధికారులు, ఫ్లయింగ్, స్టాటిస్టిక్ సర్వేయలెన్స్ బృందాలు అధికారుల నియామకం పూర్తి అయ్యిందని, నామినేషన్ స్వీకరణ కేంద్రాలు, ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పాలకుర్తి మాజీ సర్పంచ్ యకాంత రావుని పరామర్శించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



జనగామ జిల్లా ప్రతినిధి, జనవరి 12(ప్రభాత ఉదయం): ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందిన అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న పాలకుర్తి మాజీ సర్పంచ్ యకాంత రావు ని సోమవారం పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, యాకాంత రావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. అవసరమైన సహాయం ఎప్పుడైనా అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో బ్లాక్, మండల అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు, స్థానిక నాయకులు, కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608